
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 11 । అక్టోబర్ । 2025



సోమశిలలో 72.633 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 72.633 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 8444 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 2650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 3800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,25,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,278
మూడు శాతం జీఎస్టీతో	రూ.11,616
సవర (8 గ్రాములు)	రూ.92,928

గరిష్టం/కనిష్టం
35.8 /25.0

వాతావరణం

జిల్లాలో శనివారం అక్కడక్కడ పాక్షికంగా ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. శుక్రవారం గాలిలో తేమ 61 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఉలిక్కిపడుతున్న నెల్లూరు

- మద్యం, గంజాయి మత్తులో నేరాలు
- నగదు కోసం హత్యలకు తెగబడుతున్న దుండగులు

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నగరంలో సంచలనం రేకెత్తించిన జంట హత్యలను నిందితులు మత్తులో విచక్షణ కోల్పోయి ఈ ఘాతుకానికి తెగబడ్డారు. దీనికి ముందు కత్తితో చంపుతామని బెదిరించి రంగనాయకులపేట ఉప్పరపాళేనికి చెందిన గోపి వద్ద రూ.వెయ్యి దోచుకెళ్లాడు.

➡ రాము మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న అక్కసుతో స్నేహితుడు శివాజీపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు.

➡ మినీబైపాస్‌లోని ఓ విగ్రహం వద్ద పడుకుని ఉన్న వల్లి, హరిప్రసాద్‌ను మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని గుర్తు తెలియని వ్యక్తి అడిగాడు. వారు లేవని చెప్పడంతో బ్లేడ్‌తో దాడి చేశాడు.

ఇలా చెప్పుకుంటూ పోతే నగరంలో అనేక ఘటనలు తరచూ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ప్రశాంత నెల్లూరు నగరం ఉలిక్కిపడుతోంది. జంట హత్యలు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. హత్యాయత్నాలు, దోపిడీలు, దౌర్జన్యాలు మితిమీరుతున్నాయి. వరుస ఘటనలు పోలీసు గస్తీ పెంచాల్సిన ఆవశ్యకత ఉంది.

నగరంలో గంజాయి, మద్యం విక్రయాలు జోరుగా సాగుతుండగా, మత్తు ఉత్ప్రేరకాలు అందుబాటులో ఉంటున్నాయి. వీటి మత్తులో నేరాలు అధికమై శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. పాతనేరస్తులు, వ్యసనాలకు బానిసైన కొందరు తమ అవసరాలకు సరిపడా నగదు కోసం రహదారులపై కాపు కాస్తున్నారు. ఒంటరిగా వెళ్లే వారిని మారణాయుధాలతో చంపుతామని బెదిరించి అందినకాడికి దోచుకుంటున్నారు. నగదులేదని చెప్పిన వారిపై దాడులు, హత్యలకూ వెనుకాడడం లేదు. అందుకు ఇటీవల జరిగిన జంట హత్యలే నిదర్శనం. ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అన్న తేడాలేకుండా నగరంలోని అన్నీ ప్రాంతాల్లోనూ ఈ అనాగరిక సంస్కృతి కొనసాగుతోంది. దీంతో ఇంటి నుంచి బయటకు వస్తే ఎప్పుడు ఏం జరుగుతుందో? ఎవరు దాడి చేస్తారోనన్న భయంతో నగరవాసులు ఆందోళనకు గురవుతున్నారు. బాధితులు కొందరు పోలీసులకు ఫిర్యాదులు చేస్తుండగా అనేక మంది ముందుకు రాకపోవడం వెనుక భయమే కారణమని తెలుస్తోంది. పోలీసు అధికారులు స్పందించి నగరంలో ఈ తరహా నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి గస్తీని పెంచాల్సిన అవసరం ఉంది. శివారు ప్రాంతాలు, నిర్జన ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. అనధికార మద్యం విక్రయాలు, గంజాయి విక్రయాలను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలి. రాత్రి వేళల్లో తనిఖీలు ముమ్మరం చేయాలి. పాత నేరస్తులు, అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచాలి. నగరాన్ని సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావాలి. దీంతో నేరాలను కట్టడి చేయొచ్చు.

వైఎస్సార్.. వైఎస్ జగన్ పాలనలో..



పేద, మధ్య తరగతి ప్రజలు వైద్యానికి పడుతున్న ఇబ్బందులను గుర్తించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్యానికి పెద్ద పీట వేశారు. వైఎస్సార్ అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చి పేదోడు సైతం కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా పొందే వెసులుబాటు కల్పించారు. వైఎస్ జగన్ అయితే కరోనా వంటి విపత్తును సమర్థంగా ఎదుర్కొని గ్రామీణ ప్రాంతాల్లోని సబ్ సెంటర్ల నుంచి పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా వైద్యశాలలు, జిల్లా ఆస్పత్రులు, అర్బన్ హెల్త్ సెంటర్లను జీజీహెచ్‌ల వరకు నాడు–నేడు పథకం ద్వారా ఆధునికీకరించారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టారు. గ్రామీణ స్థాయి నుంచి జీజీహెచ్ వరకు కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నే రీతిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేలా స్పెషలిస్టు డాక్టర్లను నియమించారు. ఖరీదైన మందులతోపాటు సంజీవని వంటి ఇంజెక్షన్లను అందుబాటులోకి తెచ్చారు. టీడీపీ గతంలో అధికారంలో ఉండగా నిర్వీర్యం చేసిన ఆరోగ్యశ్రీ సేవలను మరింతగా విస్తరించారు. కరోనా మహమ్మారిని కట్టడి చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఆరోగ్యశ్రీ సేవలను రూ.25 లక్షలకు పెంచారు.

కూటమి పాలనలో..

పేదల వైద్య సేవలపై కూటమి ప్రభుత్వ నిర్దయ కొనసాగుతోంది. 2014–19 మధ్య ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్లక్ష్యం చేసింది. అంతకు ముందుకు 3500పైగా ప్రొసీజర్స్ ఉంటే.. వాటిని సగానికి పైగా తగ్గించడంతోపాటు అత్యంత అవసరమైన ప్రొసీజర్లను ఆరోగ్యశ్రీ నుంచి తొలగించింది. తాజాగా మరోసారి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం పేద వైద్య సేవలను నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రభుత్వ వైద్య సేవలతోపాటు ఆరోగ్యశ్రీ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ డాక్టర్లు సమ్మె చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో పేదలకు ఎటువంటి వైద్య సేవలు అందే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుత ప్రభుత్వ వైఖరి చూస్తుంటే.. కరోనా వచ్చినప్పుడు ఈ ప్రభుత్వమే ఉండి ఉంటే.. ఊర్లకు ఊర్లు శ్మశానాలు అయ్యేవంటూ గ్రామీణ ప్రజలు, పేదలు అప్పటి పరిస్థితులు తలుచుకుని ఒక్కసారిగా వణికిపోతున్నారు.

పేదల వైద్యంపై ప్రభుత్వ నిర్దయ

⏩ సమస్యల పరిష్కారానికి చొరవ చూపని కూటమి సర్కారు



➡ ఇతని పేరు తురకా వెంకటేష్. పొదలకూరు మండలం అంకుపల్లి. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) కింద వైద్యం చేయించుకునేందుకు నెల్లూరు నగరంలోని అరవింద్ కిడ్నీ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చాడు. చికిత్స చేయాలని సిబ్బందిని అడిగాడు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేశామని, వైద్యం చేయలేమని వారు తేల్చి చెప్పారు. దీంతో ఆయన బాధతో వెనుదిరిగాడు. నగరంలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఇలాంటి పరిస్థితులు అనేకం చోటు చేసుకున్నాయి.



ఆరోగ్యశ్రీ లేదని చెబుతున్న ఆస్పత్రి సిబ్బంది

- పీహెచ్‌సీల్లో డాక్టర్ల సమ్మె. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేత
- జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.200 కోట్ల బకాయిలు
- వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు



నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవలను నిలిపేస్తూ ఏర్పాటు చేసిన బ్యానర్

నెల్లూరు (అర్బన్): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ సేవలను అందుబాటులోకి తెస్తే.. తండ్రి ఆశయాన్ని కొనసాగిస్తూ ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. అయితే వారిద్దరి ఆశయాలకు తూట్లు పొడుస్తూ కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్చేసి నీరు గార్చుతోంది. ఏడాది కాలంగా ఆరోగ్యశ్రీ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడంతో బకాయిలు కొండల్లా పేరుకుపోయాయి. కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టలేక ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు తమ బిల్లులు చెల్లించాలని ఎన్నోమార్లు వినతి పత్రాలు ఇచ్చాయి. అయినా స్పందన లేకపోవడంతో విధిలేక ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) పిలుపు మేరకు జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్య సేవలు నిలిపేశాయి.

పీహెచ్‌సీ డాక్టర్ల సమ్మె

జిల్లాలో ఇప్పటికే 10 రోజులకు పైగా పీహెచ్‌సీ డాక్టర్లు తమ సమస్యలు పరిష్కరించాలని ఓపీ సేవలు బంద్ చేశారు. దీంతో ఆరోగ్యశ్రీ ద్వారా అయినా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేయించుకునేందుకు వెళ్తే.. ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని ఎన్టీఆర్ వైద్యసేవలను పూర్తి స్థాయిలో నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలిపేశాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు పెడుతున్నారు. సమస్యలను పరిష్కరించని ప్రభుత్వ తీరును రోగులు విమర్శిస్తున్నారు. జిల్లాలో జయభారత్ ట్రస్ట్, నారాయణ, ఒకటో రెండో ఆస్పత్రులు మినహా జిల్లాలో పూర్తిస్థాయిలో ఎన్టీఆర్‌వైద్య సేవ కింద రిజిస్ట్రేషన్లు బంద్ చేశారు.

విధి లేకనే సమ్మెకు..



నెట్‌వర్క్ ఆస్పత్రులకు కొండలా పేరుకు పోతున్న బకాయిలను చెల్లించాలని ప్రభుత్వానికి పలు దఫాలుగా విజ్ఞప్తి చేశాం. అసెంబ్లీ సాక్షిగా వైద్యశాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్ రూ.600 కోట్లను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశామని చెప్పారు. ఆ నిధులను తక్షణమే విడుదల చేయాలి. రూ.2,100 కోట్ల బకాయిలకు సంబంధించి తనిఖీలు చేస్తున్నామని, అవి పూర్తయిన వెంటనే నిధులు విడుదల చేస్తామని మంత్రి అసెంబ్లీలో చెప్పారు. ఎన్ని రోజుల్లో తనిఖీలు చేస్తారు. ఎప్పటిలోగా నిధులు విడుదల చేస్తారో స్పష్టంగా ప్రకటించాలి.

– డాక్టర్ ఏవీఎల్ నారాయణరావు, అరవింద్ కిడ్నీ స్పెషాలిటీ ఆస్పత్రి, నెల్లూరు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

35 ఆస్పత్రులకు రూ.200 కోట్ల బకాయిలు

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులు కాకుండా ఎన్టీఆర్ వైద్యసేవలను అందించే 35 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. అందులో నేత్ర, దంత వైద్యశాలలతోపాటు నారాయణ, మెడికవర్, ఎయిమ్స్, డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ నెల్లూరు హాస్పిటల్, విజయకృష్ణ, రిచ్, అరవింద్ కిడ్నీ స్పెషాలిటీ, సుశీలనేత్రాలయ వంటి ఆస్పత్రులున్నాయి. ఈ ఆస్పత్రు ద్వారా అన్ని రకాల స్పెషాలిటీ వైద్యసేవలు రోగులుకు అందుతున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడంతో జిల్లాలో రూ.200 కోట్లకు పైగా బకాయిలున్నాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఇక భారాన్ని మోయలేమని నిలిపేయడంతో పేదలకు కనీసం ఆరోగ్యశ్రీ ద్వారా కూడా వైద్య సేవలు అందని పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం



జిల్లాలో ప్రస్తుతానికి 10 నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెలో ఉన్నాయి. మిగతా ఆస్పత్రులో వైద్యసేవలు అందుతున్నాయి. ఎక్కడైనా ఎమర్జెన్సీ సేవలు, లేదా ఇతర సాధారణ సేవలు అందకపోతే అక్కడే ఉండే తమ ఆరోగ్యమిత్ర/టీమ్ లీడర్‌కు తెలియజేయాలి. అప్పుడు తాము ఇతర ఆస్పత్రులకు పంపించి వైద్య సేవలు అందేలా చేస్తాం. ఎమర్జెన్సీ అయితే రవాణా సదుపాయం కూడా తామే కల్పిస్తాం. రోగుల ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం.

– డాక్టర్ సుధీర్‌కుమార్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్

సూపర్ సిక్స్ పథకాలు..
డూపర్ మోసాలు



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- చంద్రబాబు అబద్ధాలు, మోసాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- 17 నెలల పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వరికుంటపాడు: చంద్రబాబు చెప్పిన పథకాలు కొన్ని అరకొర మందికి అందితే.. మరి కొన్ని అమలే చేయకుండా.. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అంటూ ప్రచారం చేసుకోవడానికి సిగ్గు లేదా? అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. కూటమి సూపర్ సిక్స్ పథకాలు.. డూపర్ మోసాలపై ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి తెలియజేయాలని కోరారు. శుక్రవారం వరికుంటపాడు మండలం ఇరువురులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సభలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను జూన్ 2024 నుంచి అమలు చేస్తానని మొదటి ఏడాది ఎగ్గొట్టారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద చంద్రబాబు రైతులకు శఠగోపం పెట్టారన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకంగా రూ.15 వేలు ఇస్తానని అరకొరగా నిధులు జమ చేశాడన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి పథకాల ఊసే లేకుండా మంగళం పాడేశారన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా, రైతులను నష్టాల ఊబిలోకి నెట్టేశారన్నారు. చంద్రబాబు తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ప్రశ్నించే వారిపై పోలీసులను ఉసిగొల్పి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, జైలుకు పంపుతున్నారన్నారు. చంద్రబాబు కాపీ కొట్టడం తప్ప, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు సొంత ఆలోచన ఉండదని, జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాలు, ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన పథకాలకు పేర్లు మార్చి, అంతా తన గొప్పేనంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చారని, దేశ చరిత్రలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో చంద్రబాబు రూ.కోట్ల విలువ చేసే భూములను ఎకరా వంద రూపాయలకు ప్రైవేట్ పరం చేస్తున్నాడని ఆరోపించారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టామన్నారు. కూటమి నేతలు కల్తీ మద్యం తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారన్నారు. చంద్రబాబు అనుచరులే కల్తీ మద్యం తయారీలో ప్రధాన సూత్రధారులుగా నిలిచారని, వీరి అండదండలు లేకపోతే చంద్రబాబు సొంత జిల్లాలో కల్తీ మద్యాన్ని స్వేచ్ఛగా తయారు చేయడం సాధ్యమేనా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీపై మీకున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని, కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన ప్రతి ఒక్క కార్యకర్తను మా భుజాలపై మోసేందుకు మేము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు పార్లమెంటరీ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు ధనుంజయరెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ యువనాయకులు మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీటీసీలు, గణపం బాలకృష్ణారెడ్డి, మేదరమెట్ల శివ లీల, చెరుకుపల్లి రమణారెడ్డి, మోడీ రామాంజనేయులు, అన్ని మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసమర్థ, అబద్ధాల పాలకులు

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతాం
- కోటి సంతకాల ఉద్యమంతో కూటమిని కూకటి వేళ్లతో సహా పెకలిస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాకాణి, ఎమ్మెల్సీలు, వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఈ రాష్ట్రంలో అసమర్థ, అబద్ధాల పాలకులు రాజ్యమేలుతున్నారని, మెడికల్ కళాశాలల విషయంలో ఇది ప్రస్ఫుటం అవుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, అనుబంధ సంఘాల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రం మొత్తం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. తొలిరోజు ఉదయగిరి నియోజకవర్గంలో లాంఛనంగా ప్రారంభించామన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా, చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల సొమ్మును ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టే విధంగా చంద్రబాబు ప్రవర్తిస్తున్నాడన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి తీసుకుని వచ్చిన 17 మెడికల్ కాలేజీల్లో 10 మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేట్ పరం చేస్తున్నాడన్నారు. పేద విద్యార్థులు వైద్య విద్య దూరం కావడంతోపాటు, పేదల కోసం ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు కాబోవన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం మెడికల్ కళాశాలకు సంబంధించి అబద్ధాలు మాట్లాడడం దారుణమని, జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం మెడికల్ కళాశాల వద్ద కూటమి నేతలు మాట్లాడే అబద్ధాలను ప్రజలకు తెలిసేలా చేశారన్నారు. కూటమి నేతలు చేస్తున్న తప్పులను ఒప్పుకోకుండా, జగన్ మోహన్ రెడ్డిపై నిందలు వేస్తున్నారన్నారు. ఆయన తెచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రైవేట్ సంస్థలకు అమ్ముకుంటూ, సొమ్ము చేసుకోవడం దుర్మార్గమన్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే ఆస్తులను ప్రైవేటు పరం చేయడాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందని, అక్టోబర్ 10 నుంచి నవంబర్ 22వ తేదీ వరకు 42 రోజుల పాటు అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తామన్నారు. అక్టోబర్ 28వ తేదీన నియోజకవర్గ స్థాయిలో, నవంబర్ 12వ తేదీన జిల్లా స్థాయిలో ర్యాలీ నిర్వహించి, ప్రజలలో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రజల నుంచి 60 వేల సంతకాల సేకరించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నవంబర్ 26వ తేదీ సేకరించిన కోటి సంతకాలను జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గవర్నర్‌కు వినతి పత్రంగా అందజేస్తామన్నారు.

మరణించే వరకు ఇద్దరికి జీవిత ఖైదు

- సామూహిక అత్యాచారం కేసులో నెల్లూరు కోర్టు సంచలన తీర్పు

నెల్లూరు (లీగల్: ఓ యువతి (19)పై సామూహికంగా అత్యాచారానికి పాల్పడినట్లు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు మరణించే వరకు జీవిత కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.2 వేల వంతున రూ.4 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ అదనపు కోర్టు జిల్లా జడ్జి సోమశేఖర్ శుక్రవారం సంచన తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. విజయనగరం ప్రాంతానికి చెందిన పల్లి కృష్ణవేణి ఉద్యోగ నిమిత్తం శ్రీసిటీలోని నిప్పాన్ స్కిల్స్ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ సూళ్లూరుపేటలోని వనంతోపులో గదిని అద్దెకు తీసుకుని ఉండేది. ఈ నేపథ్యంలో ఆ యువతి తనతో పరిచయం ఉన్న వ్యక్తితో 2019 ఫిబ్రవరి 3వ తేదీ రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో మాట్లాడుకొంటున్నారు. ఈ క్రమంలో మూత్ర విసర్జన కోసమని దక్షిణం వైపు ప్లాట్ ఫామ్ చివరకు వెళ్లగా, అక్కడే కాపుకాసి ఉన్న నలుగురు వ్యక్తులు వచ్చి యువతితో పరిచయం ఉన్న వ్యక్తిని బెదిరించి దాడి చేసి అతని వద్ద నుంచి రూ.500 బల వంతంగా తీసుకున్నా రు. తర్వాత యువతి దగ్గరకు వచ్చి కొట్టి బలవంతంగా ప్లాట్ ఫామ్ అవతల ఉన్న ముళ్ల పొదల్లోకి తీసుకుని పోయి చిత్రహింసలు పెడుతూ ఒకరి తర్వాత ఒకరుగా అత్యాచారం చేశారు. తర్వాత అక్కంపేట రైల్వేస్టేషన్‌కు తీసుకుని వెళ్లి అక్కడ రాత్రంతా నలుగురు అత్యాచారం చేసి ఉదయం 6 గంటలకు వదిలి వెళ్లారు. ఆ యువతి సూళ్లూరుపేటలోని తెలిసిన వ్యక్తితో చెప్పి ఇద్దరు పోలీస్‌స్టేషన్లో అదే రోజు ఉదయం యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితులు వెంకటగిరి వినయ్, తమిళ్ సెల్వం తిరువళ్లూరు నవీన్‌కుమార్, కాకుల దేవపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సమయంలో వినయ్, సెల్వం మృతి చెందారు. మిగతా ఇదరు సూళ్లూరుపేట కనకదుర్గమ్మ గుడికి సమీపంలోని బొగ్గులవీధి ప్రాంతానికి చెందిన తిరువళ్లూరు నవీన్ కుమార్ అలియాస్ రొడ్డ (26), సూళ్లూరుపేట సాయినగర్ ప్రాంతానికి చెందిన కాకుల దేవ(19) పైమేరకు కారాగార శిక్షతోపాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఇన్‌చార్జి అడిషనల్ పీపీ షేక్ రఫీ మాలిక్ వాదించారు.

మంత్రివర్యా.. చూస్తున్నారా?


రోడ్డు పక్కన అధ్వానంగా..


కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు


ఇలా ఉంటే రోగాలు రావా?


కాలువ మొత్తం ఇదే దుస్థితి

నెల్లూరు సిటీ.. ఇది సాక్షాత్తు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం. ఇక్కడ పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. నెల్లూరును రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతానని నిత్యం మంత్రి చెబుతుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు జనం రోగాల బారిన పడేలా ఉన్నాయి. సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్ కాలువల్లో చెత్త పేరుకుపోయింది. ప్లాస్టిక్ వ్యర్థాలు అలాగే ఉన్నాయి. దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా దీని గురించి పట్టించుకునే వారు లేకుండా పోయారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా

నాగుపాము కలకలం

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలో ఖాళీగా ఉన్న ఓ ఇంట్లో నాగుపాము కలకలం సృష్టించింది. స్థానికుల వివరాల మేరకు.. తూర్పువీధిలో షేక్ మునాఫ్ అనే వ్యక్తి ఉంటున్నాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు. వారికి వివాహమైంది. అనంతరం మునాఫ్ ఒక్కడే నివాసముంటున్నాడు. కొద్దికాలం క్రితం అతను మృతిచెందడంతో ఇల్లు ఖాళీగా ఉంది. రెండు రోజులుగా ఇంటి ఆవరణలో నాగపాము తిరుగుతుండటాన్ని స్థానికులు గమనించి ఆందోళనకు గురయ్యారు. మున్సిపల్, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే వారు రాలేదని స్థానికులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి పాము కనిపించకపోవడంతో స్థానికుల్లో భయాందోళనలు మరింత ఎక్కువయ్యాయి.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పొదలకూరు: పట్టణానికి సమీపంలో పొదలకూరు – సంగం రోడ్డు పాత బియ్యం గోదాము వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ నిర్వహించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నేదుమల్లి గ్రామానికి చెందిన మాకినేని సుధాకర్ (55) మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు కొబ్బరికాయ పీచు తాడుతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. అయితే సన్నతాడుతో చాలా కింద వేలాడుతూ ఉండటంతో అనుమానం వ్యక్తం చేశారు. ఎందుకు ఉరేసుకున్నాడో పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన సుబ్బయ్య మౌలాలి

సీతారామపురం: మండలంలోని సంజీవరెడ్డినగర్ గ్రామ సమీపాన ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఉదయగిరి నుంచి సీతారామపురం వైపునకు మోటార్‌బైక్‌పై మద్యం మత్తులో బయలుదేరిన సుబ్బయ్య వేగంగా వస్తూ సంజీవరెడ్డినగర్ వద్ద రోడ్డు దాటుతున్న మౌలాలిని ఢీకొట్టి పడిపోయాడు. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి నిర్వాకంతో ఇబ్బందులు


వేరుశనగ కాయలు విక్రయిస్తూ..

ఆత్మకూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులను అందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఆ వాహన సేవల్ని నిలిపివేసింది. దీంతో వాటిని నిర్వహించే వ్యక్తుల పరిస్థితి దుర్భరంగా తయారైంది. కొందరు కుటుంబాల పోషణ కోసం వేరుశనగ, బఠాణీలు, బొరుగులు లాంటి వస్తువులను వాహనాల్లో పెట్టుకుని విక్రయిస్తున్నారు. మరో వైపు రేషన్ దుకాణాల చుట్టూ లబ్ధిదారులు సరుకుల కోసం ఉదయం, సాయంత్రం వేళ తిరుగుతున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.113
లేయర్	రూ.122
బ్రాయిలర్ చికెన్:	రూ.206
స్కిన్‌లెస్ చికెన్:	రూ.230
లేయర్ చికెన్:	రూ.207



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15



ఉపాధిలో అక్రమాలకు కళ్లెం పడేనా?


పనులు చేస్తున్న కూలీలు


ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

- ఈకేవైసీ ప్రవేశపెట్టిన కేంద్రం
- యాప్‌లో వివరాల నమోదు

ఉదయగిరి: జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కూలీలు తమ జాబ్‌కార్డుతో ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకుంటేనే పనికి వెళ్లే వెసులుబాటు ఉంటుంది. ఈకేవైసీ నమోదు ప్రక్రియ కోసం కేంద్రం ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ సాగుతోంది. కూలీలు ఉపాధి సిబ్బందిని సంప్రదించాల్సి ఉంటుంది. ఈకేవైసీ చేయించుకోకపోతే పనిచేసే అర్హత కోల్పోతారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉపాధి పనుల్లో పారదర్శకత కొరవడటం, అవినీతి ఆరోపణలు, నిధుల దుర్వినియోగం తదితర అంశాలపై తరచూ ఆరోపణలు వెల్లువెత్తడం, సోషల్ ఆడిట్‌లో వెలుగు చూస్తుండటంతో కేంద్రం ఈ చర్యకు ఉపక్రమించింది. క్షేత్రస్థాయిలో జరిగే అవినీతికి చెక్ పెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని నిర్ణయించింది.

తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి



ఉపాధి హామీ కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఇప్పటికే నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయి. కూలీలు ఉపాధి సిబ్బంది, క్షేత్రసహాయకులను సంప్రదించాలి. ఈకేవైసీ నమోదు చేయించుకోని వారికి పని కల్పించే అవకాశం ఉండదు. – మృదుల, డ్వామా ఏపీడీ

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కుట్ర


పోస్టర్లను ప్రదర్శిస్తున్న రామిరెడ్డి, నాయకులు

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి(అల్లూరు): ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గం నుంచి 60 వేల సంతకాల సేకరణే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. నవంబర్ 25న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గవర్నర్‌కు కోటి సంతకాలు అందజేస్తామన్నారు. ఈనెల 28న కావలి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. పేదల కోసం జగన్ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఎక్కడా లేని విధంగా వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. ఇది పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమేనన్నారు. ప్రైవేటీకరణ ఆపకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, దండా కృష్ణారెడ్డి, వాయిల తిరపతి, కనమర్లపూడి నారాయణ, చెన్ను ప్రసాద్‌రెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి, దామిశెట్టి సుధీర్ నాయుడు, కుందుర్తి కామయ్య, గంధం ప్రసన్నాంజనేయులు, వెంకటేశ్వర్ రెడ్డి, షాహుల్ హమీద్, కె.శ్రీనివాసులు రెడ్డి, కె.శ్రీనివాసులు, అబ్దుల్లా, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

పొదల్లో విగతజీవిగా..

- వృద్ధుడిని ఢీకొట్టిన కారు
- డ్రైవర్ నిద్రమత్తే కారణం
- సాయంత్రం గుర్తించే సరికి ప్రాణాలు విడిచి..


ప్రమాదానికి కారణమైన కారు

దుత్తలూరు: కారు ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు పొదల్లో పడ్డాడు. ఆయన్ను ఎవరూ గుర్తించలేదు. సాయంత్రం చూసేసరికి చనిపోయి ఉన్నాడు. ఈ ఘటన శుక్రవారం దుత్తలూరు పంచాయతీ చింతలగుంట సమీపంలో 565వ జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దుగ్గినబోయిన పెదబాల నరసింహులు (70) రహదారి పక్కన నడిచి వెళ్తున్నాడు. వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ నుంచి పామూరు వైపు కారు వెళ్తుండగా డ్రైవర్ నిద్రమత్తులో నరసింహుల్ని ఢీకొట్టాడు. దీంతో కారు రోడ్డు మార్జిన్ దిగి పొదల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు అక్కడికి చేరుకుని కారును ట్రాక్టర్‌తో బయటకు తీశారు. అయితే నరసింహులును కారు ఢీకొట్టిన విషయం ఎవరూ గమనించలేదు. సాయంత్రమైనా ఆయన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలించారు. అనుమానం వచ్చి కారు ప్రమాదం జరిగిన ప్రదేశంలో చూడగా చెప్పులు కనిపించాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో చూశారు. పొదల్లో నరసింహులు విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే గ్రామస్తులు బయటకు తీయగా చనిపోయి ఉన్నాడు. గ్రామస్తులు సమాచారాన్ని పోలీసులకు అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

లెక్చరర్ ఆత్మహత్య

వెంకటాచలం: ఉరేసుకుని లెక్చరర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న అక్షర విద్యాలయ క్యాంపస్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా వల్లూరుకు చెందిన బొమ్ము నరేష్ (41) అక్షర విద్యాలయంలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. క్యాంపస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. గురువారం తన నివాసంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం 4:30 గంటల సమయంలో నరేష్ కుమార్తె ఇంటికి వచ్చింది. ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతున్న తండ్రిని చూసి పెద్దగా కేకలు వేసింది. మృతుడి భార్య శ్రావణి శుక్రవారం ఉదయం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మానసికంగా ఇబ్బంది పడుతూ తాను ఆత్మహత్య చేసుకుంటానని తరచూ బ్లాక్‌మెయిల్ చేసేవాడని, ఈ క్రమంలోనే ఇలా చేసి ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా అమ్మకాల నిలిపివేత


ఎల్‌ఎస్‌పురంలో నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ

మనుబోలు: పిడూరుపాళెంలో శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌లో సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో రూ.75,400 విలువైన యూరియాను విక్రయించడానికి వీల్లేదంటూ (స్టాప్ సేల్) ఆదేశాలు జారీ చేశామని ఏడీఏ కె.కన్నయ్య తెలిపారు. మండలంలోని ఎల్‌ఎస్‌పురం, కాగితాలపూరు, మనుబోలు, పిడూరుపాళెం, బద్దెవోలు గ్రామాల్లోని విత్తన, ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ పుస్తకాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. మన్నారు. ఆయన వెంట మనుబోలు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు

- యథేచ్ఛగా బెల్టు షాపుల నిర్వహణ
- నోటీసులిచ్చినా లెక్కచేయని 'తమ్ముళ్లు'

ఆత్మకూరు: చేజర్ల మండలం మాముడూరులో మద్యం బెల్టు షాపుల కట్టడిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ చతికిలపడింది. ఆ గ్రామంలో టీడీపీకి చెందిన బొల్లినేని పెంచలయ్య, ఉసురుపాటి కొండయ్య విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. గతంలోనూ పట్టుబడిన సమయంలో వారికి మద్యం విక్రయాలు చేయొద్దంటూ ఎక్సైజ్ శాఖ నోటీసులు జారీ చేసింది. అయినా ఖాతరు చేయకుండా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో స్థానికుల ఫిర్యాదుతో నెల్లూరు ఎక్సైజ్ స్పెషల్ స్క్వాడ్ అధికారిణి అనిత ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి దాడులు చేశారు. పెంచలయ్య దుకాణంలో 15 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. అతడిని అధికారులు తీసుకెళ్లారు. ఏం జరిగిందో గానీ శుక్రవారం ఉదయానికి ఊర్లోకి వచ్చి యథేచ్ఛగా తిగడమే కాకుండా మద్యం విక్రయాలు సాగించాడు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాటుసారా విక్రయాలు కూడా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా మస్తాన్‌బాషా


మస్తాన్‌బాషా


రామ్మోహన్‌రావు

నెల్లూరు(అర్బన్): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్‌బాషా, కార్యదర్శిగా నగరంలోని ఎండోక్రైనాలజిస్ట్ రామ్మోహన్‌రావును ఎన్నుకున్నారు. నెల్లూరు సరస్వతి నగర్‌లోని ఐఎంఏ హాల్లో గురువారం రాత్రి జరిగిన సభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా డాక్టర్ హర్షవర్ధన్, నెల్లూరు మెడికల్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, సెక్రటరీగా డాక్టర్ ప్రదీప్‌ను, కోశాధికారిగా డాక్టర్ వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మస్తాన్‌బాషా మాట్లాడుతూ అందరి సహకారంతో డాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనను ఎన్నుకున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి, గౌరవ కార్యదర్శి డా.రాహుల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- అల్లూరు రోడ్డుపై ఇదీ పరిస్థితి
- కొంతమేర వేసి వదిలేసిన వైనం


గుండాలమ్మపాళెం గాంధీ గిరిజన సంఘం వద్ద నుంచి వేసిన రోడ్డు


కొడవలూరు సమీపంలో దెబ్బతిన్న అల్లూరు రోడ్డు

కొడవలూరు: అల్లూరు రోడ్డు ప్రయాణికులకు నరకం చూపుతోంది. కొడవలూరు నుంచి అల్లూరు వెళ్లే రోడ్డుకు ఎంతో ప్రాధాన్యముంది. దీని మీదుగానే విడవలూరు, రామతీర్థం, అల్లూరుకు వెళ్లాల్సి ఉంది. మండల పరిధిలో 5 కి.మీ. మేర విస్తరించి ఉంది. ఇది పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. ఇటీవల నిర్మాణం చేశారు. కానీ కొడవలూరు నుంచి గుండాలమ్మపాళెం వరకూ ఒక కిలోమీటర్ మేర వదిలేశారు. అక్కడి నుంచి పద్మనాభసత్రం వరకూ వేశారు. పద్మనాభసత్రం నుంచి తలమంచి రోడ్డు వరకూ వేయలేదు. ఇరువైపులా కిలోమీటర్ వంతున రోడ్డు వేయకపోవడం వల్ల పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ఈ రెండు కిలోమీటర్ల రహదారి బాగా దెబ్బతిని గుంతలమయమై ఉంది. ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో బస్సులు ఎక్కువ సంఖ్యలో తిరుగుతున్నాయి. రాకపోకలు సాగించే ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారు. నెల క్రితం ఓ వ్యక్తి పడిపోయి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పైగా గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డు మలుపులుగా ఉండటంతో మరింత ప్రమాదాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో రోడ్డు బాగు పడుతుందని అందరూ భావించారు. కానీ పూర్తిగా వేయకుండా ఇరువైపులా వదిలేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే స్పందించి రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.